
## ఆటా కథల పోటీలో ప్రోత్సాహక బహుమతి పొందిన కథ

# సిద్దుల మర్రి



-జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి

ఆకాశానికి చుక్కలు... శివుని జూటానికి జడలు... సిద్దుల మర్రి మానుకి ఊడలు, ఎంచిన మొనగాడు ఇంతదాకా పుట్టలేదు.

శంబూకుని శిరస్సు తెగి పడింది, ఈ మాను కిందే! విదుర నీతి ప్రవహించింది, ఈ మాను ముందే! ఏకలవ్యుని బొటన వేలు గురుదక్షిణగా జారిపోయిందీ బ్రహ్మం గారి శిష్యుడు సిద్ధయ్య చూదేకిందీ ఈ మాను నీడనే! అందుకే దీనికి సిద్దుల మర్రి మాను అనే పేరు పడింది. అంబేత్కర్ రాజ్యాంగాన్ని చెక్కింది కూడా ఇక్కడే.

శివయ్యంటే అమ్మా అయ్యా లేని బిడ్డ. అందుకే ఆయన జటల్లో పేలు పడి నాయో లేదో చూసేదానికీ కుక్కేదానికీ ఎవరూ లేరు. కానీ ఈ సిద్దులమర్రి జటలనిండా పేలే పేలు. కొన్ని బుసలు కొడతాయి! కొన్ని కిచకిచలాడతాయి. కొన్ని ఊళలేస్తాయి! మిగిలినవి ఓండ్ర పెడతాయి!

కుక్కిన ప్రతి పేనూ కుక్కలేనన్ని పేలని కంటే గానీ చావదు.

* * *

"ఏ కులమని నను వివరమడిగితే ఏమని చెప్పుదు లోకులకూ..." ఎప్పటి మాదిరే పాడుతోంది సిద్దులమర్రి. చెవులు దిబ్బెళ్ళు వేసేంత కర్ణకఠోరంగా... గుండెలదిరిపోయేంత ప్రళయ భీకరంగా వినిపిస్తోంది! జటలు విరబోసుకున్న చీకటి దెయ్యంలా కనిపిస్తోంది.

ఇరవై ఏళ్ళప్పుడు ఇదే పాట కుల మత వర్ణ వర్గ విచక్షణ లేకుండా కోటుమీది గులాబీలా మృదువుగా గుండెను హత్తుకునేది. మరిప్పుడు... ఆ గులాబీ కింద నక్కిన కంటకమై గుచ్చుకుంటోంది.

ఆ సిద్దుల మర్రి నించీ తప్పించుకోవడానికే గేరు మార్చింది రెడ్డెమ్మ. కారు పారిపోతూండగా మర్రిమాను కింద నించే బయటికొచ్చిన పాపులమ్మ కంగారు పడుతూ పక్కకి తొలిగింది. మానుదాటుతూండగా... బీడీ ముట్టించుకుంటూ బయటికి వచ్చినట్టే వచ్చి కారుని చూడగానే చటుక్కున నీడలో నక్కిన మాదిగ వెంకటయ్యలో ఏదో తడబాటు.

పాపులమ్మ కంగారునీ వెంకటయ్య తడబాటునీ చూశాక కూడా వాళ్ళ విషయం అర్థం చేసుకోలేకపోవడానికి రెడ్డెమ్మ చిన్న పిల్లకాదు, ముష్టూరి రెడ్డిసాని!

* * *

"సూడు పాపులూ, ఎవురెన్ని చెప్పినా ఉప్పు ఉప్పే..., నిప్పు నిప్పే"

"అట్ట కాదమ్మా" అంటూ ఏదో చెప్పబోయింది పాపులమ్మ.

"దిగువ పల్లెల్లో మాలోళ్ళు అందర్తోనూ కలుస్తారు. మాదిగోళ్ళూ అంతే. అందర్తోనూ కలిసిపోతారు. కానీ మాలామాదిగా కలిసేది మాత్రం జరిగేపని కాదు. ఎగువ పల్లెల్లో కమ్మోళ్ళూ కాపోళ్ళూ కూడా అంతే. ఇది రాయి. అది టెంకాయ... ముందు పడితే మొటింకాయలే గానీ మురిపాలు వల్ల పడవు. అనుభవంతో చెప్తావున్నా ఆ వెంకటిగాని సావాసం చాలించెయ్యి. మా ఇంట స్వంత బిడ్డ మాదిర్తో పెరిగినావు. దానికే ఇంతగా చెప్తావున్నా లేకుంటే నీకూ నాకూ ఇన్ని మాటలు దేనికి"

రెడ్డిసాని మాటలకు ఆలోచిస్తా వుండిపోయింది పాపులమ్మ. ఆమెనంతకన్నా ఆలోచించనివ్వడం రెడ్డెమ్మ కిష్టం లేదు. అందుకే, "మనసు చంపుకునేది ఎంత కష్టం. అనేది నాకూ తెలుసు..., అయిందేమో అయిపోయింది. ఇంకనైనా వాని మాట మరిచిపో. మీ నాయన చూసిన సంబంధం చేసుకుని సుఖంగా బతుకు"అంటూ సలహా ఇచ్చింది. అంతేకాదు బొట్టు బిళ్ళలు చేయించుకోవడానికి డబ్బుకూడా ఇచ్చింది. పాపులమ్మ వినయంగా అందుకుని అలాగేనన్నట్లు తలాడించింది. అంతే తప్ప కులం కాని కులంలో చేసుకున్నా మీరు సుఖంగా బతకడం లేదా అని మాత్రం అడగలేకపోయింది.

ఆమె యజమాని, ఈమె పాలేరు. అందుకే ఆ ఇద్దరి మధ్య చెప్పడాలు వినడాలే తప్ప అడగడాలు అర్థం చేసుకోవడాలూ వుండవు.

* * *

రెడ్డెమ్మ ముష్టూరికి రెడ్డిసాని మాత్రమేకాదు, ఆ మండలానికి అధ్యక్షురాలు కూడా. వచ్చే ఎలక్షన్లలో తెలుగు దేశం తరపున ఎమ్మెల్యే టిక్కెట్టు తప్పకుండా వస్తుంది. ఆమె పెనిమిటి రెడ్డెప్పరెడ్డి. మంచి పేరున్న కాంగ్రెస్ లీడరు. తంబళ్ళపల్లి ఎమ్మెల్యేగా పోటీచేసి ఓడిపోయినా ఈసారి తప్పకుండా గెలుస్తానన్న ధీమాతో వున్నాడు.

ఇంట్లో చూస్తే కూతురు పెళ్ళీడుకొచ్చింది. ఆమెకి అమెరికా గుండె డాక్టరు సంబంధం చూశారు. వాళ్ళకీ అంతా నచ్చినట్లే వుంది.

ఆ రాత్రి పడగ్గదిలో ఆ సంబంధం గురించి ప్రస్తావించాడు రెడ్డెప్పరెడ్డి.

రెడ్డెమ్మ నిర్లిప్తంగా చెప్పింది, "వాండ్లు వేరే సంబంధం చూస్తావున్నారంట"

"ఏం భింగి రోగమొచ్చినాదంట వెనక్కి పోయేదానికి? మన బిడ్డకేం తక్కువైనాదని? మాటకట్టుకునేదాకా వచ్చి వెనక్కిపోతే మనకి బయసీనం కాదా"

"వాండ్లు వెనక్కిపోయింది బిడ్డని చూసి కాదంట, మనల్ని చూసి" వక్కాకు చుట్టిస్తూ చెప్పింది "నన్ను కట్టుకుని రెడ్డెరికం గబ్బు పట్టించినారంట"

ఆ మాట వినగానే నోట్లో పెట్టుకుంటున్న వక్కాకుల్ని అలాగే పక్కన కొట్టాడు రెడ్డెప్పరెడ్డి. "థూ వానెమ్మ, అమెరికాపోయినా ఆడంగి బుద్ధులు పోవు. వాడుకాకుంటే వానెబ్బలాంటి సమ్మందం తెస్తా. నా బిడ్డకేమి తక్కువే?"

"వాని సావు వాడు సస్తాడుగినీ... నా మాట విను"

ఏమిటన్నట్లు చూశాడు రెడ్డెప్పరెడ్డి.

"తిరపతిలో మా పెదనాయన చెప్పిన సంబందం కూడా చూసొద్దాం. ఎట్లా చూసినా ఈ సంబందం కంటె మేలే"

ఆ మాట వినగానే రెడ్డెప్పరెడ్డిలో అసహనం బద్దలైంది. దాంతో విసురుగా అన్నాడు. "నీకెన్ని తూర్లు చెప్పేది, ఇప్పుడంటే అన్నావుగానీ ఇంకెప్పుడూ ఈ మాట అనగాకు. అది నా బిడ్డ. దాని మంచీచెడ్డా చూసుకునేది నాకు తెలుసు. నాకు తెలవకుండా ఏ పెదనాయనతోనూ మాట్లాడగాకు." రెడ్డెమ్మకి ఇంకో మాట మాట్లాడే అవకాశం ఇవ్వకుండా అటు తిరిగి పడుకున్నాడు.

ఏం అది నీకు మాత్రమేనా, నా బిడ్డకాదా? మీ వాళ్ళు మాత్రమేనా, మా వాళ్ళు మనుషులు కారా? నీ గొప్పేమిటి? నా తప్పేమిటి? అంటూ ఎదురుతిరగడం పెద్ద పనికాదు. కానీ వేడిమీదుండగానే వంచడానికి అది ఇనుము కాదు, మనసు. వేడి దిగిపోయినాక కూరిమితో సాధించాల్సిన పని. అందుకే మారు పలక్కుండా ఇటు తిరిగి పడుకుంది.

అలా ఎంతసేపు పడుకున్నా నిద్రపట్టలేదు. తలనిండా ప్రశ్నలు. తమ ఇద్దరిమధ్యా సఖ్యతకీ సదవగాహనకీ కొదవలేకున్నా తనవాళ్ళూ అతని వాళ్ళూ, తన సమాజం అతని సమాజం తనకీ అతనికీ మధ్య ఎలా నిలబడగలుగుతోంది? ఎందుకు నిలబడుతోంది? తమవాళ్ళ సంబంధాన్ని అతనెందుకు ఒప్పుకోలేకపోతున్నాడు? తను మాత్రం, అతని తరఫు సంబంధాన్ని ఎందుకు అడ్డుకోవాలనుకుంటోంది? లోపం ఎక్కడుంది?

ఆలోచనలు రగిల్చిన అసహనంతో ఇటు తిరిగింది. మంచం మీదుండాల్సిన భర్త పెరట్లో వున్నాడు. పడక్కుర్చీలో సిగరెట్టు కాలుస్తూ చుక్కల్లోకి చూస్తూ ఏదో వెతుక్కుంటున్నాడు.

"ఏ కులమని నను వివరమడిగితే ఏమని చెప్పుదు లోకులకు..." సిద్దుల మర్రిమాను ఎప్పట్లాగే పాడుతూనే

వుంది. అలా పాడుతూ పాడుతూనే రెడ్డెమ్మని జవాబులు అడుగుతూనే వుంది. అలా అడుగుతూ అడుగుతూనే ఆమెని ఇరవై ఏళ్ళనాటి గతానికి లాక్కుపోయింది.

★ ★ ★

చిన్నకమ్మ పల్లెనించీ మర్రిమాను దావన ముష్టూరికొచ్చి చదువుకుంటూ వుండే రెడ్డెమ్మ. రెడ్డెమ్మంటే అందానికి అందం! గుణానికి గుణం! అణకువకి అణకువ! అలాంటి అమ్మాయి ఎదురుపడాలేగానీ మనసు పడని మగాడు మగాడే కాదు.

అయినాసరే ముష్టూరిలో ఎవ్వరి చూపూ ఆమె మీద పడలేదు. దేనికంటే ముష్టూరిరెడ్డివారిపల్లె అంటే కాపోళ్ళ రాజ్యం. రెడ్డెమ్మ కమ్మ ఇంటిబిడ్డ. కమ్మోళ్ళకీ కాపోళ్ళకీ నడుమ సంబంధం నీళ్ళకీ తామరాకుకీ వుండే సంబంధం లాంటిదే. వుండేది నీళ్ళల్లోనే అయినా మీద ఒక్క నీటి చుక్కని కూడా నిలవనివ్వదు తామరాకు. అలాంటప్పుడు పుగసాటోళ్ళ ఆడబిడ్డ రెడ్డివారిపల్లెకి వచ్చినప్పుడు ఏదైనా ఎక్కువ తక్కువలు జరిగితే రెడ్డెరికానికెంత చిన్నతనం! అందుకే కమ్మ బిడ్డంటే స్వంత ఆడబిడ్డ మాదిరి.

అందుకే ఏ రెండు కళ్ళూ ఆమెవైపు తిరగలేదు.

అందుకే రెడ్డెమ్మ ఓ మంచి ముహూర్తం చూసుకుంది. తనే ఓ వాలు చూపు విసిరింది. ఇంక అప్పుడు కూడా అందుకోకుంటే కోర మీసం వుండీ ఏం గుణం! అందుకే రెడ్డెప్ప రెడ్డికూడా కన్ను కలిపాడు. అందుకే ఇద్దరికీ మర్రి మాను సాక్షిగా మనసైంది!

అంతలోనే పరీక్షలు అయిపోయాయి. ఇంక చదువుల వంకన రోజూ ముష్టూరికి వచ్చే అవకాశంలేదు. రెడ్డెప్పరెడ్డిని కలిసే అవకాశం కల్పించుకుంటే తప్ప కలగని పరిస్థితి. విషయంగానీ పొక్కిందా ఇంక ఏ అవకాశమూ కల్పించుకున్నా కలగదు. అందుకే ఇద్దరిమధ్యా చూపులు కూడా కరువైపోయాయి.

★ ★ ★

ఎన్టీరామారావు తన కూతుర్ని చంద్రగిరికి ఇచ్చేంతవరకూ ఆ పక్క కమ్మోళ్ళంతా కమ్మోళ్ళుగానే వుండేవాళ్ళు. అప్పట్నించీ మెల్లమెల్లగా తెల్లపంచెలూ ఖద్దరుచొక్కాలూ కిర్రు చెప్పులూ సంబరాలకి మాత్రమే కాకుండా మామూలుగా వాడకం మొదలైంది. అన్నగారు తెలుగుదేశం పెట్టి అది కాస్త ఊపుమీదకి వచ్చేసరికి కమ్మోళ్ళంతా పూర్తిగా చౌదర్లయిపోయారు. ఎలక్షన్లు దగ్గరపడుతున్నకొద్దీ ముష్టూరు కనపడ్డమే మానేసింది.

ఇలాంటి పరిస్థితుల్లో ముష్టూరిలో మంతనాలు మొదలయ్యాయి. అంతవరకూ అక్కడి రాజకీయమంతా ముష్టూరిలోనే వుండేది. ఇప్పుడు కమ్మపల్లెల్లోకూడా మొదలవుతూ వుంది. అలాంటప్పుడు కాంగ్రెస్ ప్రచారంకోసం కమ్మపల్లెలు తిరగడం అనవసరమని కొందరూ, అలాంటప్పుడే ప్రచారంకోసం పదే పదే తిరగాలని మరి కొందరూ తీర్మానించుకున్నారు. రెడ్డెప్పరెడ్డి రెండో తీర్మానం చేసిన వాళ్ళతోనే తిరగడం మొదలుపెట్టాడు. అందరి కారణమూ ప్రచారం. అతని కారణం మాత్రం రెడ్డెమ్మ.

కారణం ఏదయితేనేం, చిన్న కమ్మపల్లెకి పోవడంవల్ల రెడ్డెప్పరెడ్డికి మేలే జరిగింది. లేకుంటే..., రెడ్డెమ్మకి పెండ్లి చూపులు జరిగిన సంగతీ, రెడ్డెప్పరెడ్డితో ప్రేమ గురించి చెప్పి ఆయమ్మ ఇంట్లో దెబ్బలుతిన్న సంగతీ, ఈ విషయం తెలిసిన వెంటనే వాళ్ళ పెద్దలు పోయి మాట కట్టుకుని వచ్చిన సంగతీ తెలిసేవి కావు.

ప్రచారం పూర్తిచేసుకుని వెనక్కి వస్తూండగా మర్రి మాను కింద ఎదురొచ్చింది రెడ్డెమ్మ. అటునించీ అటే వచ్చేస్తానంది. ఎటయినా తీసుకుపొమ్మంది. రెడ్డెప్పరెడ్డి వినలేదు. తిన్నగా ఆమెని వాళ్ళింటికి తీసుకువెళ్ళాడు. ఆమె పెద్దవాళ్ళకి తమ ప్రేమ గురించి మర్యాదగా చెప్పాడు. వాళ్ళు వినలేదు. తమవంటి పెద్ద రాజకీయ కుటుంబం కోరి వచ్చినప్పుడు కాదనడం ఇంటికొచ్చిన అదృష్టాన్ని అడ్డుకోవడం లాంటిదేనని చెప్పి చూశాడు. అయినా వాళ్ళు వినలేదు. తమవంటి వారిని ఎదురు వేసుకుని బతకడం కష్టమని బెదిరించాడు. అయినా వాళ్ళు వినలేదు.

★ ★ ★


రెడ్డెమ్మకి పెండ్లి జరుగుతూ వుంది. అయ్యవారు మంత్రాలు చదువుతున్నాడు. పెండ్లికొడుకు సంబరంగా ఆయన చెప్పిందల్లా చేస్తున్నాడు. రెడ్డెమ్మ మాత్రం ఆయన ఒకటి చెబితే ఇంకోటి చేస్తోంది.

ఆమెకి మనసు మనసులో లేదు. ఇటు ముహూర్తం దగ్గరపడుతోంది. అటు ముత్తైదులంతా తాళిబొట్టుకి మొక్కుతున్నారు. ఆమెకి బొట్టు బిళ్ళలు నల్లనాగు పడగ మీది కృష్ణపాదాల్లా కనిపిస్తున్నాయి. పసుపుతాడు సంకెలలా కనిపిస్తోంది. అదిగానీ మెడకి చుట్టుకుందా, దాన్ని మించిన చావులేదు.

అయ్యవారు లేచి నిలబడమంటున్నారు. అమ్మలక్కలు జడ నెత్తిపట్టుకుంటున్నారు. పెండ్లికొడుకు బొట్టు దారాన్ని సరిచూసుకుంటున్నాడు. మేళగాళ్ళు పెళ్ళి మేళం వాయించడానికి సిద్ధంగా వున్నారు.

అంతలోనే వేగంగా వచ్చిందో జీపు. అది ఆగేలోపుగానే అందులోంచీ దూకాడు రెడ్డెప్పరెడ్డి.

తెలుగుదేశం గెలిచినా కాంగ్రెస్ ఓడినా రెడ్డెరికం రెడ్డెరికమే. ఆ దర్బారూ దర్పం చూసి లోపల్లోపల కుళ్ళుకుంటున్నవాళ్ళు కూడా పైకి మాత్రం నవ్వులు కురిపిస్తున్నారు. లౌక్యం ఎరుగని వాళ్ళు మాత్రం ముఖాలు ముడుచుకుంటున్నారు.



రెడ్డెప్ప రెడ్డి తిరగబడినాడు. అంతే... టెంకాయ పట్టలు కొట్టడానికి పెట్టిన మచ్చు కొడవలిని అందుకున్నాడు. అదే ఊపుమీద పెండ్లికొడుకు తల తెగనరికినాడు. మొండెం నేలపడి కొట్టుకుంటానే వుంది.

ఎవ్వర్నీ పట్టించుకోకుండా నేరుగా మంటపం దగ్గరకి పోయాడు రెడ్డెప్పరెడ్డి

రెడ్డెమ్మ కండ్లల్లోకే చూస్తూ ఒకేమాట అడిగాడు, "నీకీ పెండ్లి ఇష్టమేనా?"

లేదన్నట్లు తల అడ్డం ఊపింది.

నన్ను చేసుకునేది ఇష్టమేనా?

"ఇష్టమే"

"అయితే రా పోదాం"అంటూ ఆమెని మంటపం మీంచీ కిందకి దించుతూంటే పెండ్లికొడుక్కి కడుపు కాలిపోయింది.

"నా పెండ్లాన్ని పిలుచుకుని పోయేదానికి నువ్వెవడ్రా" అంటూ రెడ్డెప్పరెడ్డి మీదకి విరగబడినాడు. రెడ్డెప్పరెడ్డి తిరగబడినాడు. అంతే... టెంకాయ పట్టలు కొట్టడానికి పెట్టిన మచ్చు కొడవలిని అందుకున్నాడు. అదే ఊపుమీద పెండ్లి కొడుకు తల తెగనరికినాడు.

మొండెం నేల పడి కొట్టుకుంటానే వుంది. దాన్నలా వది లేసి పెండ్లి కొడుకు తలని మంటపంలో గౌరమ్మముందు పెట్టినాడు. ఒకేఒక్క మాట అడిగినాడు, ఎవురు రెడ్డెమ్మ మొగుడు... నువ్వా? నేనా? పెండ్లి కొడుకు తల భయంతో పలికింది," నువ్వే... నువ్వే" అలా రెండుసార్లు పలికి గమ్మునుండిపోయింది. ఆ కళ్ళల్లో మాత్రం అదే భయం.

జరిగిందేమిటో అక్కడున్నవారికి అర్థమయ్యేలోపే రెడ్డెమ్మ మెడలో తాళి కట్టేశాడు. అదే ఊపులో ఆమెని లాక్కుపోయి జీపెక్కించాడు.

దూరంనించీ వస్తున్న జీపుని గమనించింది మర్రి మాను. భళిరారెడ్డీ భళా... కులం కంటె గుణం గొప్పదని చూపినావురా. మనిషికంటె మనసు గొప్పదని చాటినావురా అంటూ పరిపరి విధాలుగా అభినందిస్తూ పాడుతోంది" ఏ కులమని నను వివరమడిగితే..."

మర్రిమాను దాటే లోపే ఎదురుపడింది పోలీసు జీపు. దాన్ని చూడగానే రెడ్డెమ్మ బాధ్యతని డ్రైవరుకప్పగించాడు. తన భార్యగా రెడ్డెమ్మకి ఎలాంటి ఇబ్బందీ కలగకుండా చూసుకోమన్నట్లు తన మాటగా తన వారందరికీ చెప్పమన్నాడు. డ్రైవరు తప్పించుకుపొమ్మని చెప్పినా వినకుండా పోలీసులకి లొంగిపోయాడు.

★ ★ ★

అప్పుడు కమ్మరెడ్డెమ్మ... ఇప్పుడు రెడ్డిసాని.

అదే ముష్టూరు... అదే రెడ్డెరికం... అదే దర్బారు... అదే

(మిగతా 12వ పేజీలో)

## నా గురించి



రచయితగా నాకూ ఆటాకీ వున్న అనుబంధం విడదీయరానిది. వారు నిర్వహించిన వేరు వేరు పోటీల్లో నా 'వలసదేశం' నవలకీ, చిల్లపెంకులు, బిత్తలబోకి, ఇప్పడీ 'సిద్దుల మర్రి' కథలకీ బహుమతులిచ్చి ప్రోత్సహించారు.

రాయడానికి రాయాలన్న ఉత్సాహమూ, రాయగల నేర్పరితనమూ వుంటేచాలదు. రాయడం ఒక సామాజిక బాధ్యత అన్న ఎరుకని కలిగించిన మా నాన్నగారు స్వర్గీయ జొన్నవిత్తుల రామకృష్ణ శర్మ గారికి ఈ బహుమతి అంకితం.

నేను పుట్టింది కోపల్లెలో. రచయితనయ్యింది పాపిరెడ్డిగారి పల్లెలో.. ప్రస్తుతం వుంటున్నది హైదరాబాద్‌లో.. ఉద్యోగం కన్నడ రచయితగా..

అడ్రస్:
-జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి,
ఫ్లాట్ నెం: 14, రోడ్ నెం:1, టెలిఫోన్ కాలనీ,
శ్రీరామకృష్ణాపురం, హైదరాబాద్-35

(9వ పేజీ తరువాయి)

నడక! అదే నడత!

అయినాసరే తాళిబొట్టు పడిన తరవాత ఏదో తెలియని దగ్గరతనం. ఇదీ అని చెప్పలేని ఆత్మీయత. తేడా వచ్చింది ఆ కలువ రేకులాంటి కన్నుల్లో కాదు. ఆ కళ్ళు చూస్తున్న చూపులో. అందుకే అంతవరకూ "పుగసాటోళ్ళు"గా వున్న వాళ్లే "అయినోళ్ళు"గా కనిపిస్తున్నారు. ఈ కొత్త "అయినవాళ్ళ"ని ఆ కొత్త చూపుతో అర్థం చేసుకుంటూ వుండగానే రెడ్డెమ్మ నెల తప్పింది.

జైలుకెళ్ళి ఈ శుభవార్త చెప్పగానే మీసం మెలి తిప్పాడు. ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకొమ్మని పదే పదే చెప్పాడు.

కూతురు పుట్టిందని తెలియగానే రెడ్డెమ్మని మాటవరసక్కూడా సలహా అడక్కుండానే తన తల్లి పేరునే కూతురికి పెడుతున్నట్లుగా ప్రకటించాడు. కూతురు పుట్టిన ఆనందంలో తన మాట మరచిపోయాడని సరిపెట్టుకుంది రెడ్డెమ్మ.

* * *

రెడ్డెప్పరెడ్డి కుటుంబమంటే ఆ చుట్టుపక్కల రాజకీయాలకి కేంద్ర బిందువు. అలాంటి కుటుంబంలోకి ఓ కమ్మ ఇంటి ఆడపడుచు కోడలిగా రావడం అదే సమయంలో తెలుగుదేశం అధికారంలోకి రావడం కాకతాళీయం. మండలాలు పడినప్పుడు రెడ్డెమ్మకి తెలుగుదేశం తీర్థం ఇప్పించారు. మండలాధ్యక్షురాలిగా పోటీకి నిలబెట్టారు.

రెడ్డెమ్మ రెడ్డిసాని కాబట్టి కాపోళ్ళ ఓట్లూ రెడ్డేరిపల్లెల దిగువ పల్లెల ఓట్లూ పడ్డాయి. పుట్టుకతో కమ్మవారింటి ఆడపడుచు కాబట్టి కమ్మపల్లెల ఓట్లూ వాటి దిగువ పల్లెల ఓట్లూ పడ్డాయి. దాంతో పాపం ఆమెపై పోటీకి నిలబడినాయనకి డిపాజిట్టుకూడా దక్కలేదు.

ఎలక్షన్లకీ కులాలకీ ఆర్థిక లావాదేవీలకీ సామాజిక కట్టుబాట్లకీ మధ్యనున్న సంబంధాలు అర్థంకాని వయసులోనే వాటి ఫలాల్ని అందిపుచ్చుకుని పిన్న వయసులోనే మండలాధ్యక్షురాలిగా స్థిరపడి పోయింది.

* * *

రెడ్డెప్పరెడ్డి విడుదలయ్యాడు.

ముష్టూరంతా పండగ చేసుకుంది.

రెడ్డెమ్మ సంతోషానికైతే పగ్గాలే లేవు. అంత కాలంగా రెడ్డిసాని హోదానైతే అనుభవిస్తోంది గానీ అవతరించింది మాత్రం అప్పటినించే.

ఆలూమగలంటే ఆ ఇద్దరిలా వుండాలని ఊరూ వాడా చెప్పుకునేవారు. మనసులు కలవాలే గానీ పులీమేకా ఒకటైపోతాయనే సామెత వాళ్ళతోనే పుట్టింది.

ఆ ఇద్దరిలో ఎవరు ఎంతగా ఒకటైపోయినా రెడ్డెప్పరెడ్డి మాత్రం కాంగ్రెస్ పార్టీని వదిలిపెట్టలేదు.

* * *

మండలాధ్యక్షురాలిగా రెడ్డెమ్మ చిన్న కమ్మపల్లెకి చిన్నా చితకా సౌకర్యాలని కల్పించడమే కాదు అయినవాళ్ళకి కొద్దోకొప్పో సంపాయించుకునే అవకాశం కూడా కల్పించింది. ఆ క్రమంలో భాగంగా హంద్రీ నీవా సుజల స్రవంతి పనులని తన అన్నగారికిప్పించుకుంది.

* * *

ఈలోగా అధికార మార్పిడి జరిగి తెలుగుదేశం పోయి కాంగ్రెస్ వచ్చింది. తెలుగుదేశం పథకాల్ని తల్లకిందులు చెయ్యకపోతే అది కాంగ్రెస్ ఎందుకవుతుంది? అందుకే ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి.

అలా ఆగిపోయిన పనుల్లో హంద్రీ నీవా ఒకటి.

పనులనేవి అయినవాళ్ళకిప్పించుకోవడానికే వుంటాయి. అలాంటి పనుల్ని ఆపుచెయ్యడం తెలివైన పని కాదు. అందుకే ప్రాజెక్టు పేరు మార్చారు. పనుల్ని పునరుద్ధరించారు.

ఈసారి రెడ్డెప్పరెడ్డి పలుకుబడిని ఉపయోగించి అదే హంద్రీ నీవా పనుల్ని తన మేనమామకిప్పించుకున్నాడు.

ఈ విషయం తెలిసిన రెడ్డెమ్మ ఆ రాత్రి అతడిని దగ్గరకి చేరనివ్వలేదు. ఆమెని బుజ్జగించే ప్రయత్నంలో తన మేనమామ ఎన్ని కష్టాల్లో వున్నదీ వివరించాడు. అయినా ఆమెలో మార్పు రాలేదు. ఆ రాత్రి మంచానికి ఆమె అటు ఈయనిటు.

నేనూ నువ్వూ ఒకటే కావచ్చు, కానీ నేనూ నా వాళ్ళూ లేరన్న భావం ఆయన కళ్ళల్లో ఆమెకీ ఆమె కళ్ళల్లో ఆయనకీ కనిపించింది. అందుకే ఇద్దరి కళ్ళూ ఒకటే అయినా చూపులు మాత్రం వేరవుతున్నాయి.

**ఏ కులమూ లేకపోతే శైవానికీ వైష్ణవానికీ సామరస్యంగా బసవన్న వేసిన దారి కొత్తకులంగా ఎందుకు దాపురించింది? ఏ కులమూ లేకుంటే హైందవానికీ మహమ్మదీయానికీ వారధిగా నిలచిన గురునానక్ మత ప్రవక్తగా ఎందుకు మారాడు? వెనుకబడ్డ కులాల వాళ్ళని ముందుకు తేవడానికి ప్రభుత్వాలు ప్రయత్నాలు చేస్తున్నకొద్దీ కులాల సంఖ్య పెరిగిందే తప్ప వెనుకబాటు తనం తరగలేదేం?**

* * *

మనిషి ఆలోచనలాగిపోవచ్చు. అవగాహన మారిపోవచ్చు. కానీ కాలం మాత్రం ఆగదు. అందుకే సరోజారెడ్డి వయసుకొచ్చింది. చదువులు పూర్తిచేసింది. పెళ్ళీడుకొచ్చింది. ఆమెకి తొలి సంబంధం తెచ్చినవాడు రెడ్డెమ్మ పెదనాన్న.

పెళ్ళికొడుకు తెలుగుదేశంలో వెలుగులోకి వస్తున్న యువ నాయకుడు. ముఖ్యమంత్రి దగ్గర పలుకుబడి వున్నవాడు. రెడ్డెప్పరెడ్డికి నచ్చలేదా సంబంధం. దానిక్కారణం తమ అల్లుడు రాజకీయాల రంపుకి దూరంగా ప్రశాంతంగా బతకాలన్న కోరిక కొంతయితే ఆ సంబంధం తెచ్చినవాడు రెడ్డెమ్మ పెదనాన్న కావడం మరి కొంత. అందుకే తను వేరే సంబంధాలు చూడ్డం మొదలు పెట్టాడు.

ఓ మంచి అమెరికా సంబంధం వచ్చింది. కుర్రాడు గుండె స్పెషలిస్టు. తండ్రి కూడా గుండె డాక్టరే. వాళ్ళు పంపిన ఫొటో చూసింది రెడ్డెమ్మ. ఆమెకి పెళ్ళికొడుకు ఎంతగా వచ్చాడో వాళ్ళు తమ ఇంటికి పెట్టుకున్న పేరు అంతకంటే ఎక్కువగా నచ్చింది. దాని పేరు "వసుధైక కుటుంబం". దాన్ని చూశాక తమ బిడ్డ చేరవలసిన సరైన చోటు అదేననుకుంది.

పెళ్ళి చూపులయ్యాయి. వరస చూస్తుంటే అంతా నచ్చినట్లే వుంది. వాళ్ళూ వాళ్ళ పద్ధతులూ ఉదయ సంధ్యకి సాయం సంజె కెంజాయల్నద్దినట్లున్నాయి. వాళ్ళ తెలుగు, ఇంగ్లీషులా వుంది. వాళ్ళ ఇంగ్లీషూ అంతే తెలుగులా వుంది.

మంచిరోజు చూసుకుని వచ్చి తాంబూలాలు పుచ్చుకుంటామని చెప్పి వెళ్ళారు.

ఆ పెళ్ళికొడుకు పేరు "చంద్రారెడ్డి" కావడం యాదృచ్ఛికం కాదు. అందుకే మర్రిమాను తెల్లబోయింది. తెల్లబోతేనేం... కొల్లబోతేనేం... పాట మాత్రం ఆపదుగాక ఆపదు. "ఏ కులమని నను వివరమడిగితే ఏమని చెప్పుదు లోకులకూ..."

అలా పాడుతూ పాడుతూనే రెడ్డెమ్మని మళ్ళీ లాక్కొచ్చి మంచం మీద కూలదోసింది.

పిచ్చి మాను... పిచ్చి పాట... ఏకుతూ ఏకుతూ తానేకులమో మరిచిపోయినట్లుంది. అందుకే ఏ కులమూ లేదని గుడ్డి పాట పాడుతూ కూర్చుంది. ఏ కులమూ లేకపోతే శైవానికీ వైష్ణవానికీ సామరస్యంగా బసవన్న వేసిన దారి కొత్తకులంగా ఎందుకు దాపురించింది? ఏ కులమూ లేకుంటే హైందవానికీ మహమ్మదీయానికీ వారధిగా నిలచిన గురునానక్ మత ప్రవక్తగా ఎందుకు మారాడు? వెనుకబడ్డ కులాల వాళ్ళని ముందుకు తేవడానికి ప్రభుత్వాలు ప్రయత్నాలు చేస్తున్నకొద్దీ కులాల సంఖ్య పెరిగిందే తప్ప వెనుకబాటు తనం తరగలేదేం? అన్నీ దేనికి అమెరికా దాకా అభివృద్ధి చెందిపోయిన ఆ వసుధైక కుటుంబం గాళ్ళు తాంబూలాలకి బదులుగా వాళ్ళ మనసెందుకు మార్చుకున్నారు? అసలు ఏ కులమూ లేకపోతే ఆయనకి కమ్మ భార్య కమ్మగా వుంది గానీ కమ్మ అల్లుడెందుకు రుచించడం లేదెందుకు? తనకి మాత్రం? పెదనాయన చూసిన సంబంధాన్నే చెయ్యాలని ఎందుకనిపిస్తోంది?

ప్రశ్నలు... ప్రశ్నలు... ప్రశ్నలు... తన మీదకి తాను సంధించుకుంటున్నకొద్దీ మెదడు అక్షయ తూణీరం అయిపోతోంది.

పాపులమ్మ తమ ఇంట్లో తమ స్వంత బిడ్డలా పెరిగింది. ఆమెగనక వెంకటయ్యని కట్టుకుంటే ఆమెనీ ఇవే ప్రశ్నలు వెంటాడుతాయి. అలాంటి మొండి ప్రశ్నల బారినించీ ఆమెని రక్షించానన్నదే రెడ్డెమ్మకి ఊరట. భర్త ఏం చేస్తున్నాడోనని మళ్ళీ బయటికి చూసింది.

రెడ్డెప్పరెడ్డి సిగరెట్టు మారిందిగానీ ఆరింది కాదు. పడక్కుర్చీలోనే వున్నాడు. ఆకాశంలో చుక్కల్ని లెక్కిస్తూనే వున్నాడు.

* * *

మరుసటిరోజు మామూలుగా తెల్లవారలేదు.

మర్రిమానులోని కాకులన్నీ ఊరంతా కోళ్ళై కూశాయి.

పాపులమ్మ లేచిపోయింది!

వెంకటయ్య లేపుకుపోయాడు!!

"అయినా పుగసాటోళ్లకి ప్రేమేంది, ప్రేమ?"

"ప్రేమా చింతకాయా... అంతా వేడి. దిగిపోతానే దీని దావ దీనిది. వాని దావ వానిది. రెడ్డేరింట రాణి మాదిరుండేది. ఇంక చెప్పుల చారే గతి"

ఎవడిష్టప్రకారంగా వాళ్ళు ఊరంతా కాకులయ్యారు! కుక్కలయ్యారు!!

* * *

రెడ్డెమ్మ అద్దంలో చూసుకుంటోంది. తన ప్రతిబింబాన్ని వెతుక్కుంటోంది. ఎంత వెతికినా అద్దంలో తన ముఖం కనపడటంలేదు, పాపులమ్మ తప్ప.

ఆ పాపులమ్మని చూసి నిట్టూరుస్తూ అంది రెడ్డెమ్మ "పిచ్చి దానా చూస్తూండు పాతికేళ్ళ తరవాత నీ బిడ్డకి నువ్వూ ఇదే కథ చెబుతావు."

దానికి పాపులమ్మ తడుముకోకుండా ఇచ్చింది సమాధానం. "అన్ని కథలూ నీ కథ మాదిరే దేనికుంటాయి కమ్మరెడ్డిసామెమ్మా. దేని కథ దానికుంటుంది".

ఆ సమాధానం వినగానే ఠక్కున పాటనాపేసింది సిద్ధుల మర్రి మాను. ★